క్లుప్తంగా

కోడి పందేలాడుతున్న ఆరుగురి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పందెం రాయుళ్లు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు కొబ్బరితోటలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్సై జి.విజయబాబు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... తేటగుంటలో కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3500, నాలుగు కోళ్లు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తహసీల్దార్ కోర్టులో హాజరుపర్చామన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గజ్జి అప్పలరాజు, చింతాకుల సుబ్రహ్మణ్యం, యనమల రాంబాబు, గంపల బాబురావు, కక్కల రోహిణికుమార్, జువ్వల అర్జునరావు ఉన్నారు. జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆధునిక పరిజ్ఞానం అవసరం

తుని: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఫొటో, వీడియో గ్రాఫర్లకు ఆధునిక పరిజ్ఞానం అవసరమని తెలుగు రాష్ట్రాల కెనాన్ కెమెరా కంపెనీ మెంటర్ నాగం భూపాల్‌కుమార్ అన్నారు. స్థానిక రోటరీక్లబ్ సమావేశ మందిరంలో శుక్రవారం కాకినాడ జిల్లాలోని ఫొటో, వీడియో గ్రాఫర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఫొటోగ్రఫీ రంగంలో ఉన్న ఆధునికతను ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు. ఫొటోలను అందంగా చిత్రీకరించడంతో మెళకువలను వివరించారు. కెనాన్ కంపెనీలో వెడ్డింగ్ ఫొటో గ్రఫికి అవసరమైన లేటెస్టు టెక్నాలజీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కెనాన్ ఏరియా సేల్స్ మేనేజర్ వరుణ్, అప్పా రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్ర, ఉపాధ్యక్షుడు సీహెచ్ లోవబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారున వైన్ షాపు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.7300 స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4250 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సతీష్

రౌతులపూడి: స్థానిక ప్రధాన రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో చాకిరేవుపాలెం గ్రామానికి చెందిన కె.ప్రసాద్, గుమ్మడి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... రౌతులపూడి సినిమా సెంటర్ వైపు బైక్‌పై వెళుతున్న వీరిద్దని ఎదురుగా వస్తున్న పాసింజర్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ప్రసాద్, సతీష్ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెనుమల్ల గంగిరెడ్డి (ఫైల్)

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి వద్ద ఈ నెల 8న రెండు బైకులు దగ్ధమైన ఘటనలో తీవ్రంగా గాయపడిన పెనుమల్లు గంగిరెడ్డి (38) కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు స్థానిక ఎస్సై రవికుమార్ తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగిరెడ్డిని కాకినాడ ఆస్పత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జన సైనికులపై కేసు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ దగ్ధం ఘటనలో 30 మంది జనసైనికులపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఇన్‌చార్జ్ ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లో శుక్రవారం రోడ్డుపై జనసేన నాయకులు, కార్యకర్తలు ధర్నా చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. ఇదే సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీ దగ్ధం కావడంతో స్థానిక వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జనసైనికులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కర్షకా.. నీటికి దిగులు లేదిక..

- నేడు పంపా ఆయకట్టుకు నీరు విడుదల
- 12,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు





గేట్ల వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పంపా సిబ్బంది

అన్నవరం/తొండంగి: పంపా ఆయకట్టుకు శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నీటిని విడుదల చేస్తారని తొండంగి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పంపా రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి మెయిన్ కెనాల్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తారన్నారు.

రెండు నియోజకవర్గాల్లో..

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండేళ్ల నుంచి ఆయకట్టు పరిధిలో రెండు పంటలకు పూర్తిస్థాయిలో నీటిని విడదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

99.30 అడుగుల నీటిమట్టం

పంపా రిజర్వాయర్‌లో శుక్రవారం నాటికి 99.30 అడుగుల నీటిమట్టం ఉంది. పంపా గరిష్ట నీటి మట్టం 103 అడుగులు కాగా, గరిష్ట నీటి నిల్వ 0.43 టీఎంసీలు. ప్రస్తుతం 0.299 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రిజర్వాయర్‌లోకి 35 క్యూసెక్కుల నీరు వస్తోందని అధికారులు తెలిపారు. తొలిరోజు 25 క్యూసెక్కుల నీటిని మంత్రి రాజా లాంఛనంగా విడుదల చేస్తారన్నారు. అనంతరం రైతుల అవసరాలను బట్టి నీటి విడుదలను పెంచుతామని వివరించారు. ఆయకట్టుకు నీటి విడుదల సందర్భంగా పంపా ప్రాజెక్ట్ గేట్లు వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. కాలువలను శుభ్రం చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్
- సిరిపురంలో గడపగడపకూ మనప్రభుత్వం



సిరిపురంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సిరిపురంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హతలు ఉండి పొరపాటున ఇప్పటివరకూ ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీతల నూకరాజు, మజ్జూరి సూర్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, అచ్చే సీతారామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

గోకవరం: సీలింగ్ యాక్ట్ పేరుతో తమ వద్ద నుంచి తీసుకున్న భూములను తమకు ఇప్పించాలని మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం గోకవరం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని 7.64 ఎకరాల భూమిని సుమారు 50 ఏళ్ల నుంచి 12 మంది రైతులు సాగు చేసుకుంటున్నామని, ఈ భూములను 2015లో సీలింగ్ యాక్ట్ పేరుతో తమ నుంచి అధికారులు తీసుకున్నారన్నారు. ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్న తాము జీవనం కోల్పోయామన్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని కోరారు.

శాకంబరిగా అభయదుర్గమ్మ



కిర్లంపూడి: ఆషాఢమాసంలో చివరి శుక్రవారం కావడంతో గ్రామాల్లోని దుర్గమ్మ అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జగపతినగరంలో వేంచేసిన అభయదుర్గమ్మను పండితులు కూరగాయలతో శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారున వేంచేసిన వనదుర్గమ్మ ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవో షేక్‌బాబ్జీ శుక్రవారం తెలిపారు. ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కర్రి హర్షిత, ఏ.కల్యాణి శ్రీకాకుళం క్యాంపస్‌కు, ఎంపీఎస్ అనంత లక్ష్మి, సీహెచ్ శివపార్వతితో పాటు అద్దరిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని చవాకుల కల్యాణి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

కాలిబాట వంతెన నిర్మించాలని వినతి



కాకినాడలో ఎంపీ వంగా గీతకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు కాలువపై వంతెన నిర్మించాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ శుక్రవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 12 కులాలకు చెందిన ప్రజలు కర్మకాండల నిమిత్తం కాలువ దాటి వెళ్లాల్సి ఉండగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను ఎంపీపీ, జెడ్పీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ వంగా గీతను లిఖితపూర్వకంగా కోరారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీతలను కలిసి వంతెన నిర్మాణానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



తుని లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

తుని: పట్టణ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రావి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. స్థానిక క్షత్రియ భవన్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. క్లబ్ వైస్ ప్రెసిడెంట్లుగా కేఆర్‌బీబీ రమణ, వి. రమణమ్మ, వి.నరశింహారావు, కార్యదర్శిగా శరకణం ప్రసాదబాబు, జాయింట్ సెక్రటరీలుగా కోటిపల్లి గోవిందు, ట్రెజరర్‌గా కోరుబిల్లి సత్యనారాయణ, కో ట్రెజరర్‌గా అత్తి అనంతపద్మనాభం ఎన్నికయ్యారు. మెంబర్‌షిప్ చైర్మన్‌గా టీవీ శ్రీనివాస్, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా టి.సూర్యప్రకాశరావు, మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్మన్‌గా జీఎస్వీ సత్యనారాయణ, ఎల్సీఐఎఫ్ కో ఆర్డినేటర్‌గా పి.రామారావు, గ్రీటింగ్ కమిటీ చైర్మన్‌గా జి.జానకిరామయ్య, అడ్మినిస్టేటర్‌గా పోతల రమణతో పాటు మరో తొమ్మిది మందిని క్లబ్ మెంబర్లగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ డీవీఎస్ రాజు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డి.రాఘవేంద్రరావు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

నేడు మంత్రి రాజా పర్యటన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీడీఓ పసపులేటి సతీష్ శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

‘సురక్ష’తో అర్హులందరికీ మేలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం



ములగపూడిలో విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



తునిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి



వల్లూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ రాము, అధికారులు

రౌతులపూడి: గ్రామాల్లోని అర్హులందరికీ మేలు చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామన్నారు. గ్రామాల్లో సేవా దృక్పథంతో పనిచేసే వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. ప్రజలు సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, రామకుర్తి బాబ్జి, అంకంరెడ్డి సతీష్ కుమార్, డీటీ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సిరిపురంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలోని లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల నూకరాజు, మజ్జూరి సూర్యనారాయణ, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి, చిక్కాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

తుని: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 19, 20, 21 వార్డులకు సంబంధించి శుక్రవారం 10వ సచివాలయంలో కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి దరఖాస్తుదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ అధికారులు

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల వద్దకే ప్రభుత్వ అధికారులు వచ్చి వారికి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తున్నట్టు ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము తెలిపారు. మండలంలోని వల్లూరులో శుక్రవారం గ్రామ సర్పంచ్ కుర్ర విజయలక్ష్మి అధ్యక్షతను జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూలతో కలసి ఎంపీపీ ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపీటీసీ పెదకాపు తాతారావు, తహసీల్దార్ ఎల్.శివకుమార్, ఈఓపీఆర్‌డీ జయరామ్, మాజీ వైస్ ఎంపీపీ కుర్ర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లులో శుక్రవారం ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నక్కా వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మడిక శ్రీనివాసరావు, వీఆర్వో గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని మండపం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఇతర అధికారులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నక్కా మాణిక్యం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటనందూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబుతో కలిసి ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

గోకవరం: మండలంలోని ఇటికాయలపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు 1500 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తిరుమలాయపాలెంలో లబ్ధిదారులకు సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

వలంటీర్లకు వందనం



ఇంటి వద్దకే పథకాలు

వలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయి. మా వలంటీర్ గుడాల నానాజీ రెండు రోజులకు ఒకసారైన వచ్చి పలకరిస్తాడు. అమ్మఒడి, రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ పథకాలకు ఇంటి వద్దే దరఖాస్తులు తీసుకున్నాడు. ఆ పథకాల నిధులు నేరుగా బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. పథకాలు కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైనసేవలు అందుతున్నాయి.

– పోరుపల్లి మంగ, హంసవరం, తుని మండలం



పుట్టింటికి వచ్చి.. పింఛన్ ఇచ్చి..

నా భర్త చనిపోవడంతో అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అమృతపురంలోని మా పుట్టింటికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడే కొన్నివారాలు ఉన్నాను. గ్రామంలో ఐదో తేదీ వరకూ పింఛన్ తీసుకోలేదు. బంధువుల వద్ద సమాచారం, అడ్రసు తెలుసుకుని వలంటీర్ మిడతాన లక్ష్మి మా పుట్టింటికి వచ్చి పింఛన్ అందించింది. వలంటీర్ రాకపోతే పింఛన్ రద్దయిపోయేది.

– సుర్ల వీరమణి, తాళ్లూరు, తుని మండలం



కొడుకులా సేవలందిస్తూ..

గతంలో పెన్షన్ డబ్బులు కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మాకు గ్రామంలోనే పింఛను అందుతోంది. మా వలంటీర్ గణేష్ మాకు వృద్ధాప్య, దివ్యాంగ పెన్షన్లను ఇంటికే తెచ్చి ఇస్తున్నాడు. ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పిస్తున్నాడు. ఎప్పటికప్పుడు ఇంటికి వచ్చి మా అవసరాలు తెలుసుకుంటున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కన్న కొడుకులా సేవలందిస్తున్నాడు.

– మెడబల్మి సత్యవతి, గృహిణి, పైడికొండ, తొండంగి మండలం

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి



రైతుకు కంది విత్తనాలు అందిస్తున్న నాయకులు

కోటనందూరు: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు చేసేలా ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు రాగులు, కొర్రలు, జొన్నలు వంటి చిరు ధాన్యాలు పండిస్తే అధిక ఆదాయం వస్తుందన్నారు. నీటి ఎద్దడి ఉన్న పొలాల్లో కొబ్బరి, పామాయిల్ వంటి పంటలను సాగు చేసి అంతర పంటలుగా కూరగాయలు, బొప్పాయి, పూల మొక్కలను పెంచితే లాభదాయకంగా ఉంటుందన్నారు. తాండవలో ఆశాజనకంగా నీటినిల్వలు ఉన్నందున రైతులను ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమారి, ఏఏబీ సభ్యులు పాల్గొన్నారు.

జయహో చంద్రయాన్



జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ఇస్రో చేస్తున్న చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ మండలంలోని ధర్మవరంలో శ్రీప్రతిభ విద్యాలయ విద్యార్థులు శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. విద్యాసంస్థ అధినేత డి.శేషారావు చంద్రయాన్–3 విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ జయహో భా రత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు/ఏలేశ్వరం: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారికి సిద్ధం చేసిన 900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. 8 లీటర్ల సారా, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం వెంకటనగరంలో పది లీటర్ల సారాతో నెల్లి అప్పయ్యమ్మను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో కాకినాడ ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, కాకినాడ ఎస్ఈబీ సీఐ పి.సునీల్, డీటీఎఫ్ ఎస్సై జె.విజయ్‌కుమార్, ఏలేశ్వరం ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితుల వేలం పేరు మార్పు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివాహ పురోహితుల వేలాన్ని «పురోహితుల సంభావన హక్కు» మార్చినట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం తెలిపారు. వేలం అనే పదం వలన తమ మనోభావాలు దెబ్బతింటున్నాయన్న పురోహితుల అభ్యంతరం మేరకు పేరు మార్చినట్లు ఈఓ వివరించారు.

న్యాయవాదుల ధర్నా

ప్రత్తిపాడు: న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా లాయర్స్ అసోషియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడులో శుక్రవారం న్యాయవాదులు ధర్నా చేపట్టారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.750 చేయాలని, ఎస్టీ, ఎస్సీ, జూనియర్ లాయర్లకు మూడేళ్ల స్టైఫండ్ ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన న్యాయవాదులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, కమిటీ సభ్యులు ఆకాశపు మల్లేశ్వరరావు, అవసరాల దేవి, బార్ ప్రతినిధులు ఆదారి సుగుణ, రాజాల చిట్టిబాబు, కుత్తం అనూహ్య, పిల్లి బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

మాజీ మంత్రి తోట నరసింహం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

కిర్లంపూడి: రాష్ట్రంలోని అన్ని వర్గాలు అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోట నరసింహం అన్నారు. మండలంలోని భూపాలపట్నంలో తోట బాబ్జీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. బేరి బాబ్జీ, తోట రాంజీ, అడబాల సుబ్బారాయుడు, ఓలేటి రాజు, అత్తులూరి సాయిబాబు, తూలా రాము, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.